# షాక్

వాణిశ్రీ



రెండు ప్రపంచ యుద్ధాలలోనూ మరణించినవారి సంఖ్య కన్నా, ఇప్పటివరకూ కారు ప్రమాదాలలో ప్రాణాలు పోగొట్టుకున్న వారిసంఖ్య ఎక్కువని ఆ రోజు పేపర్లో చదివినప్పుడు వెంకట్రావు ఆశ్చర్యపోయాడు.

ఆ విషయం నిజమేనా ? లేక పేపరువాళ్ళ అభూత కల్పనా ? అని అనుమానం వచ్చింది. ఈ పేపరువాళ్లు పేజీలు నింపటానికి ఇటువంటివి సృష్టిస్తుంటారని ఎవరో అన్నమాటలు అతని బుర్రలో తొలుస్తున్నాయి.

అతని ముప్ఫైఏళ్ళ జీవిత చరిత్రలో ఒక్క ప్రమాదమూ తటస్థపడలేదు మరి.

కాని ఆ రోజు—

వెంకట్రావు ఆఫీసుకు వెళ్తూ ఉండగా మెయిన్‌రోడ్‌మీద రివ్వున వస్తున్న చిన్నకారు సడన్ బ్రేక్‌తో పెద్ద శబ్దం చేస్తూ ఆగడం, అతనెవరో ఎగిరి రెండు గజాలదూరంలో పడి నెత్తురు మడుగులో స్పృహ తప్పిపోవటం చూసి అతని కళ్ళు చెదిరిపోయాయి.

వెంకట్రావు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మనసులో అలజడి చెలరేగింది. ఎవరో తన ఆత్మీయుడికే ఆ ప్రమాదం జరిగినంతగా చలించి పోయాడు. వెన్నముద్దలా కరిగి పోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

జనం చుట్టుముట్టారు. కొందరు డ్రైవర్ని పట్టుకుని తిడుతున్నారు. అంతా గందరగోళం.

పోలీసు వేన్ వచ్చింది. జనం తప్పుకుని దారి ఇచ్చారు.

ఎవరో పాపం అభాగ్యుడు. ఇంచు మించు వెంకట్రావు ఈడువాడే. బ్లూ కలర్ ప్యాంట్, తెల్లటి షర్టు టక్ చేశాడు. అతని ఉంగరాల జుట్టు చూస్తుంటే ఎవరో జ్ఞాపకం వస్తున్నారు.

ఇనస్పెక్టర్ అతని జేబులో దొరికిన పర్సు విప్పి అడ్రసు చదివాడు. "నారాయణరావు, పి. స్టీల్ మర్చంట్, మెయిన్ రోడ్, ఏలూరు."

వెంకట్రావు అదిరిపోయాడు.

అరే ! వీడు నారాయణరావా ?

ఎంత మారిపోయాడూ !

పదిహేను సంవత్సరాలు దాటి పోయాయి. ఆ రోజుల్లో ఇద్దరూ సహపాఠులు.

ఒకసారి నారాయణరావు తనను మృత్యుముఖంనుంచి కాపాడాడు.

నారాయణరావు చాలా మంచివాడు. స్నేహపాత్రుడు.

ఇప్పుడు చావు బ్రతుకులమధ్య ఊగిసలాడుతున్నాడు.

ఏమీ ఎరగనివాడిలా తన దారిన తాను వెళ్ళిపోవడం మానవత్వంకాదని అని అతని అంతరాత్మ ఘోషించింది.

అంబులెన్సులో హాస్పిటల్‌కు తీసుకు వెళుతూ ఉంటే, తను అతని స్నేహితుణ్ణి అని చెప్పి వెంకట్రావు కూడా వెళ్ళాడు.

"ప్రాణభయం ఏమీ లేదులెండి. తెలివి రావడానికి టైమ్ పడుతుందని డాక్టర్ చెప్పాడు" అన్నాడు ఇనస్పెక్టర్.

వెంకట్రావు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

నారాయణరావు అడ్రెసుకి టెలిగ్రాం ఇచ్చి, ఎందుకైనా మంచిదని ఒక ఉత్తరం గూడా రాసిపడేశాడు.

వాడికి తెలివి వస్తుందేమోనని అక్కడే రాత్రంతా ఉన్నాడు వెంకట్రావు.

ఏలూరులో చదువుకుంటున్న రోజులు, నారాయణరావు తన ప్రాణం కాపాడిన సంఘటన గుర్తుకొచ్చాయి.

"ఆ రోజు ఆగష్టు 15. స్వాతంత్ర్య

దినోత్సవ వేడుకలు టౌన్‌లో బాగా జరుగుతూ ఉండేవి. పిల్లలు ఇష్టం వచ్చినట్లు, బస్సులు, లారీలు ఆపి రోజంతా ఉత్సాహంగా తిరిగేవారు. నారాయణరావు అందరిలోకి పెద్దవాడు. పిల్లల జట్టుకి నాయకత్వం వహించి ఊరంతా తిప్పాడు. సాయంకాలానికి అలసిపోయి ఇంటిముఖం పట్టారు. అందులో ఎవడో కృష్ణాకాలవలో ఈత కొడదామని అన్నాడు. వెంటనే అంతా బట్టలు విప్పి ఒడ్డున పడేసి కాలవలో దూకారు చెక్కవంతెనమీద నుంచి. తనకు ఈత రాదు. అయినా నలుగురితోపాటు ఉత్సాహంతో కాలవ లోకి దిగాడు ముందు మోకాళ్ళ లోతు. తర్వాత నడుం లోతు. ఇంకా ముందుకు వెళ్ళడానికి భయంవేసి అక్కడే నిల్చుండి పోయాడు. 'రా...రా...' అని ఎవరో లోపలికి లాగారు. అంతే తూలిపడ్డాడు. ప్రవాహంలో ఎంత దూరం కొట్టుకుపోయాడో తెలియదు. తెలివి వచ్చేసరికి తను నారాయణరావు చేతుల్లో ఉన్నాడు. చుట్టూ ఆదుర్దాగా, భయంగా చూస్తున్న స్నేహితులు ఉన్నారు. కాలవలో కొట్టుకుపోతున్న తనని నారాయణరావు రక్షించాడని తర్వాత తెలిసింది.

ఈ కథంతా తెలిసి ఇంట్లో అమ్మా, నాన్న గొడవచేసి కొన్నాళ్ళు బడి మాన్పించారు. అదంతా ఒక కథ.

*  *  *

వెంకట్రావు ఆఫీసుకు సెలవు పెట్టి నారాయణరావు బెడ్‌దగ్గరే కూర్చున్నాడు.

తర్వాత అతనికి తెలివి వచ్చింది.

ముక్కుతూ, మూలుగుతూ మనుషుల్ని గుర్తుపట్టే పరిస్థితిలో లేడు.

తల చుట్టూ బాండేజీ, మిగతా శరీరానికి అక్కడక్కడా కట్లు కట్టారు.

రోజులు గడుస్తున్నా నారాయణరావు భార్యగాని, బంధువులుగాని రాకపోవడం వెంకట్రావుకి ఆశ్చర్యం కలిగించింది.

టెలిగ్రాం అంది ఉండదా? పోనీ లెటర్ కూడా రాశానే?

ఎందుకని రాలేదు? ఒకవేళ భార్యాభర్తల మధ్య మనస్పర్థ లేవైనా ఉన్నాయా? ఉంటేమాత్రం అపాయ స్థితిలో ఉన్న భర్తను చూడడానికి రాకుండా ఉంటుందా? పోనీ అతని తల్లిదండ్రులుగాని దగ్గరి బంధువులుగాని ఎవరూ రాలేదే?

ఒకవేళ ఇంట్లో ఎవరూ లేరేమో? ఏ పెళ్ళికైనా వెళ్ళారేమో? అలాగైతే రేపో, మాపో రావడం ఖాయం.

"పీడికి తెలివి వస్తే బాగుండును" అనుకుంటూ నిద్రలోకి జారిపోయాడు వెంకట్రావు.

మర్నాడు నారాయణరావుకి పూర్తిగా తెలివి వచ్చింది. లేచి కూర్చోగలిగాడు.

వెంకట్రావు ఫ్లాస్కులోంచి కాఫీ వంపి, అతనికి ఇచ్చాడు.

అతను నెమ్మదిగా గుటకలు వేసి, "థాంక్స్" అన్నాడు.

"అబ్బ! ఎన్నాళ్లకి మనుషుల్లో పడ్డావురా." అన్నాడు వెంకట్రావు ఆనందంగా.

అతను వెంకట్రావుని గుర్తుపట్టినట్లు లేదు.

విచిత్రంగా చూశాడు.

"ఎవరండీ మీరు ?" అన్నాడు ఆశ్చర్యంగా.

తనను నారాయణరావు గుర్తుపట్ట లేదని వెంకట్రావు తెలుసుకున్నాడు.

"అవును మరి. పదిహేను సంవత్సరాలు గడిచిపోయాయి. అందులోనూ తను పూర్తిగా మారిపోయాడు కూడా. ఎలా గుర్తుంటుంది" అనుకుని నవ్వుకున్నాడు.

"నేనురా బాబూ, వెంకట్రావుని. ఏలూర్లో నువ్వూ, నేనూ సుబ్బమ్మాదేవి హైస్కూల్లో చదువుకున్నాం. జ్ఞాపకం లేదూ ! ఒకసారి నేను కాలవలో కొట్టుకుపోతుంటే నువ్వు రక్షించావు గూడా. ఆ రోజు ఆగష్టు పదిహేను..."

అతను ఆలోచనలో పడ్డాడు.

"నీకు యాక్సిడెంట్ జరిగినప్పుడు సమయానికి నేను ఆఫీసుకు పోతూ అక్కడే ఉండడం జరిగింది. నీ పర్సులో అడ్రసు ఉండబట్టి గుర్తు పట్టాను," అన్నాడు వెంకట్రావు.

వెంకట్రావు చెప్పినదంతా విని అతను నవ్వాడు.

"నేను నారాయణరావుని కాదండీ," అన్నాడు నెమ్మదిగా.

"మరి !"

"నా పేరు గోపాలకృష్ణ."

"ఆ పర్స్."

"ఆ పర్స్ నారాయణరావుదే కావచ్చు." తాపీగా అన్నాడు.

"అది మీ కెలా వచ్చింది?"

అతను నవ్వి "నా బ్రతుకుతెరువు అదే కాబట్టి" అన్నాడు.

వెంకట్రావు వెర్రిముఖం వేశాడు.

"థాంక్స్ అండీ. మీ స్నేహితున్ని అనుకుని నాకు చాలా సహాయంచేశారు." అతను నవ్వుతూ నమస్కారం చేశాడు.

వెంకట్రావుకి ముళ్ళమీద నిల్చున్నట్లనిపించింది.

తడబడుతున్న అడుగులతో హాస్పిటల్ నుంచి బయటపడ్డాడు.

ఇంటికి వెళ్ళి చూసేసరికి నారాయణరావు రాసిన లెటర్ వచ్చింది.

"వారం క్రితం తన పర్సు గుంటూరు బస్ స్టాండులో పోయిందనీ, తను అర్జెంటుగా వెళ్ళిపోవాల్సి వచ్చి, రిపోర్టు ఇవ్వలేక పోయాననీ" అందులో సారాంశం.

చిన్ననాటి స్నేహితుడనీ, వాడు తనకి చేసిన ప్రాణదానానికి బదులు సపర్యలుచేసి బాకీ తీర్చుకుంటున్నాననే భ్రమలో పడిపోయాడు.

"ఈ దొంగవెధవకి నేను ఏ జన్మలోనో బాకీ," అనుకున్నాడు వెంకట్రావు.

———